క్లుప్తంగా

క్యాన్సర్ బాధితునికి అండగా..



చికిత్స పొందుతున్న హేమంత్

శ్రీకాకుళం అర్బన్: అంపోలు గ్రామానికి చెందిన ఉట్ల హేమంత్‌కుమార్ కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. గురువారం అత్యవసర పరిస్థితిలో ఇంజక్షన్ అవసరం కావడంతో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, సింధూర హాస్పిటల్ తరఫున ఉచితంగా సమకూర్చారు. ఈ సందర్భంగా హేమంత్ కుటుంబసభ్యులు డాక్టర్ పైడి.సింధూరకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఉర్లం శివతేజ, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాపీ ధర్మారావు జయంతి వేడుకలు



ధర్మారావు జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: తెలుగు భాషా పండితుడు, ప్రముఖ హేతువాది తాపీ ధర్మారావు జయంతి వేడుకలను లావేరు మండలంలోని అదపాక ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ ధర్మారావు అనేక రచనలు చేసి ప్రజానీకాన్ని మూఢ నమ్మకాల నుంచి దూరం చేశారన్నారు. ఆయన భావజాలం ఆచరణీయమన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బి.జగన్నాథరావు, ఎస్.వి.రమణ, పైడి రామస్వామి, నాయుకులు జి మురళి, ఎస్.కృష్టారావు, పి.ఉదయకుమార్, ఎస్.బాలకృష్ణ, ఎం.వి.కామేశ్వరరావు, రుద్రప్రతాప్, ఎస్.రాజేశ్వరి, ఉమారాణి విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



ఇందిరావిజ్ఞాన్ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీపై బీజేపీ, మిత్రపక్షాలు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని డీసీసీ జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్టారావు అన్నారు. బీజేపీ శివసేన (షిండే వర్గం) శాసనసభ్యులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంబటి కృష్టారావు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్ వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, కె.వెంకట్రావు, అంబటి దాలి నాయుడు, కె.రాంప్రసాద్, ఏ.రవికుమార్, అంబటి రాజారావు, అంబటి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి ధర్మాన పరామర్శ



నివాళులర్పిస్తున్న ధర్మాన ప్రసాదరావు

గార: రామచంద్రాపురం సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి తండ్రి గొలివి అప్పన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు గురువారం పరామర్శించారు. చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ గొండు కృష్ణమూర్తి, చల్ల రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణ, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, అంబటి లింగమూర్తి, అల్లు లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

పేకాట శిబిరంపై దాడి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని న్యూకాలనీలో ఓ నివాస గృహంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటాక వచ్చిన సమాచారంతో సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు సిబ్బందితో వెళ్లి దాడులు చేయగా రూ.78,030 నగదుతో వీరు పట్టుబడ్డారు. నగదును స్వాధీనం చేసుకుని జూదరులను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: పాత జాతీయ రహదారిపై ఎచ్చెర్లలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాడితమాను రాజు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. చిలకపాలెం గ్రామానికి చెందిన ఈయన బైక్‌పై శ్రీకాకుళం వెళ్తుండగా.. వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. శ్రీకాకుళం రిమ్స్‌కు 108లో తీసుకెళ్లారు. శ్రీకాకుళం ఔట్ పోస్టు పోలీసుల సమాచారం మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్వచ్ఛహారం

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కూడలిలో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతా నినాదాలు చేశారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నినాదాలు చేశారు.

- శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)



మహా కుంభాభిషేక ఉత్సవం

శ్రీకాకుళం నగరంలోని మొండేటివీధిలో లక్ష్మీ గణపతి ఆలయం ప్రతిష్టించి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా గురువారం మహా కుంభాబిషేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలి రోజు సత్యవరం గ్రామానికి చెందిన వనమాలి శాంతారావు వర్గులు ఆధ్వర్యంలో పల్లకీపై లక్ష్మీగణపతి స్వామివారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. కార్యక్రమంలో షిరిడీసాయి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

ఫలించిన పోరాటం

- పెదగనగళ్లవానిపేటలో రొయ్యిల చెరువుల పూడ్చివేత
- వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన గ్రామస్తులు
- ఎన్‌జీటీ ఆదేశాల మేరకు చెరువులను పూడ్చివేస్తున్న అధికారులు



చెరువులను పూడ్చివేస్తున్న రెవెన్యూ యంత్రాంగం

శ్రీకాకుళం రూరల్ : రొయ్యిల చెరువుల కారణంగా ఇబ్బందులు పడుతున్నామంటూ శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పెదగనగళ్లవానిపేట పంచాయతీ ప్రజలు కొన్నాళ్లుగా నిర్వహిస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలో సుమారు 47 రొయ్యిల చెరువులను రెవెన్యూ యంత్రాంగం గత మూడు రోజులుగా పూడ్చి వేస్తోంది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యర్థాలతో కాలుష్యం..

కొన్నేళ్లుగా ఇక్కడి చెరువుల్లో రొయ్యిల పెంపకాలు ఇతరులు చేపట్టేవారు. దీంతో స్థానికంగా నివాసం ఉన్నవారికి ఈ చెరువుల వల్ల ఇబ్బందులు ఎదురయ్యేవి. నదీగమనం ఎక్కువయ్యేటప్పుడు, వరదలు వచ్చేటప్పుడు చెరువుల్లో నీరు పొంగిపోయి గ్రామాల మీదుగా వచ్చేది. రొయ్యిలకు సంబంధించి వ్యర్థాలు కూడా భూగర్భంలో కలిసి పరిసరాలు కలుషితంగా మారేవి. దీంతో పెదగనగళ్లవానిపేట, మోపసుబందరు, నర్సయ్యపేట, ఖాజీపేట గ్రామాలకు చెందిన వారంతా అవస్థలు పడేవారు. ఆయా ప్రాంతాల్లో తాగునీరు సైతం కలుషితంగా మారిపోతోందని, దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయని గ్రామస్తులు దఫదఫాలుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై చుట్టుపక్కలా కొన్నాళ్ల కిందట నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో సైతం ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి ఆదేశాలు రావడంతో రెవెన్యూ అధికారులు చెరువుల పూడ్చివేతకు రంగంలోకి దిగారు.

చెరువులను కప్పేస్తాం

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పెదగనగళ్లవానిపేట పంచాయతీ పరిధిలో 47 రొయ్యిల చెరువులను పూర్తిగా కప్పివేస్తాం. ఇప్పటికే రెండు జేసీబీలతో మూడు చెరువులను పూడ్చేశాం. మరో వారం రోజుల్లో మిగిలిన చెరువు గట్టులన్నింటినీ సమాంతరంగా నేలమట్టం చేస్తాం.

– గణపతిరావు, శ్రీకాకుళం రూరల్ మండల తహసీల్దార్

వై.ఎస్.జగన్‌ను కలిసిన కిరణ్‌కుమార్



రణస్థలం: విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి నియోజకవర్గం పరిస్థితిని వివరించారు. పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

పోషకాలు మెండు



లావేరు మండలం చిన్నమురపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



యూనియన్ బ్యాంక్ నూతన శాఖను ప్రారంభిస్తున్న శాలినీ మీనన్

శ్రీకాకుళం అర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యమని ఫీల్డ్ జనరల్ మేనేజర్(విశాఖ) శాలినీ మీనన్ అన్నారు. శ్రీకాకుళం కొత్త రోడ్డు జంక్షన్ వద్ద బ్యాంక్ నూతన శాఖను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ హెడ్ ఏం.వెంకట తిలక్ మాట్లాడుతూ జిల్లాలో 40 బ్రాంచిలు ఉన్నాయని, తాజాగా మరో రెండు శాఖలు ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌హెచ్ రవి, సుబ్ నారాయణ్, చీఫ్ మేనేజర్లు గాయత్రీ, చైతన్య, బ్యాంకు మేనేజర్లు శ్రీనివాస్, శ్రీను, నూతన శాఖ మేనేజర్ పి.అజయ్ కుమార్, ఉద్యోగ సంఘ నాయకులు బి.శ్రీనివాస్, ఆఫీసర్ సంఘ నాయకులు కె.తేజేశ్వరరావు, బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ వివాదం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సూర్యమహాల్ జంక్షన్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, అక్కడే ఉన్న టిఫిన్ షాపు వ్యాపారి మధ్య గురువారం రాత్రి వాగ్వాదం జరిగింది. సూర్యమహాల్ కూడలి మలుపు వద్ద టిఫిన్ షాపు నిర్వహిస్తుండటంతో కస్టమర్లు పార్కింగ్ చేస్తుండటంతో బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వచ్చేవారికి ఇబ్బందిగా పరిణమిస్తోంది. ఇదే విషయమై బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి టిఫిన్ వ్యాపారిని ప్రశ్నించడంతో సదరు వ్యాపారి తిరగబడ్డాడు. దీంతో అక్కడే ఉన్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులంతా వచ్చి టిఫిన్‌షాపు వద్దకు చేరుకున్నారు. సమాచారమందుకున్న ఒకటో పట్టణ హెడ్ కానిస్టేబుల్ బొమ్మాళి రవికుమార్ వచ్చి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ఈ ప్రాంతం ట్రాఫిక్ జోన్‌లో ఉన్నందున రెండుమూడు రోజుల్లో ఖాళీ చేయాల్సిందేనని వ్యాపారికి సూచించారు.

ఉపాధి సిబ్బందిపై ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ రెయ్యమ్మ

జి.సిగడాం: ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.నిర్మెలకు పాలఖండ్యాం సర్పంచ్ రెయ్యమ్మ గురువారం ఫిర్యాదు చేశారు. సర్పంచ్ అయిన తనకు తెలియకుండా, గ్రామసభ తీర్మానం లేకుండా ఉపాధి పనులు చేసి బిల్లులు చేయించుకున్నారని, గ్రామ సభ తీర్మానంలో గుర్తించని పనులు కూడా చేశారన్నారు. వాటిపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరు గట్లపై మొక్కలు, మర్రి అప్పారావు తోటలో ఫారం పాండ్ నిర్మించారన్నారు. పలు ఇళ్లకు ఉపాధి పథకం ద్వారా బిల్లులు చెల్లించారన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురిషోతంనాయుడుతోపాటు ఇతర అధికారులకు కూడా సమాచారం ఇచ్చామన్నారు. దీనిపై ఎటువంటి స్పందన రాలేదన్నారు. పంచాయతీ రాజ్ మంత్రి పవన్‌కల్యాణ్ మాత్రం గ్రామసభ తీర్మానంతోపాటు సర్పంచ్‌కు గౌరవం ఇచ్చి పనులు చేయాలని సూచించారని, మండల స్థాయి అధికారులు మాత్రం నాలాంటి సర్పంచ్‌లకు గౌరవం ఇవ్వడంలేదని ఆవేదన చెందారు. కలెక్టర్, రాష్ట్ర కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేస్తానన్నారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రత్యేకాధికారిని నియమించి దర్యాప్తు చేయిస్తామన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



జి.సిగడాం: మాట్లాడుతున్న వెంకటరమణ

జి.సిగడాం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవి కుమార్ అన్నారు. జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నర్సింహంమూర్తి సమక్షంలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, కుప్పిలి రవికుమార్ పట్నాయక్, పీడీ కొంచాడ బెనార్జీ, భూపతి శ్రీరామమూర్తి, నాయకులు భూపతి అర్జున్‌నాయుడు, అరెల్ల గోల్లాజీ, ముజ్జి కన్నంనాయుడు, కోనా వెంకటరావు, పీడీలు రాహుల్, యుగంధర్, రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



జి.సిగడాం: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు..

జి.సిగడాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పార్కులో చెత్తను తొలగిస్తున్న కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని, మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ అన్నారు. నగరంలో గురువారం స్వచ్ఛతా హై సేవా 2024 కార్యక్రమంలో భాగంగా ఏపీహెచ్‌బీ కాలనీలో పార్కులో చెత్త తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి, ఏసీపీలు, టీపీవో, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గార: కళింగపట్నం కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి గొలివి రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. జూనియర్ రెడ్‌క్రాస్, రెడ్‌క్రాస్ సేవలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పలరాము, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇందిర, బి.చిన్నయిరావు, పవన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీయూకేటీలో..

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హై సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు స్వచ్ఛత ప్రాధాన్యతపై డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ వివరించారు. క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్‌గా తయారుచేసేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మునిరామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: ఆర్‌జీయూకేటీ క్యాంపస్ వద్ద అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది



జి.సిగడాం: బాతువలో మొక్కలు నాటుతున్న నాయకులు

బాతువలో..

జి.సిగడాం: బాతువ గ్రామంలో స్వచ్ఛతా హై సేవా కార్యక్రమాన్ని సర్పంచ్ దబ్బాడ కల్యాణి ఆధ్వర్యంలో రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరి బాబు, ఎరియా మేనేజర్ తవిటినాయడు సమక్షంలో హరితా సమగ్ర గ్రామీణా అభివృద్ధి సంస్థ ద్వారా గురువారం వనమహోత్సవం నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లుకలాపు ఉషారాణి, నాయకులు బూటు అప్పారావు, దబ్బాడ ఆదినారాయణ, కూనిబిల్లి కూర్మారావు, పొతిరెడ్డి సన్యాసినాయుడు, హరితా సంస్థ సభ్యులు టంకాల మోహన్ రంగా, కలిశెట్టి ఆదినారాయణ, రెడ్డి అసిరినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గార: మొక్కలు నాటుతున్న విద్యార్థులు

రోగుల అవస్థలు



బాతువ పీహెచ్‌సీ వద్ద వేచి ఉన్న రోగులు

జీఓ నంబర్ 85ను ప్రభుత్వం రద్దు చేయాలని వైద్యులు సమ్మె చేయడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు విజయవాడ దీక్షకు వెళ్లిపోయారు. బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జి.అనూష, ప్రతిష్ట శర్మ, జి.సిగడాం వైద్యులు బి.యశ్వంత్, పి.సుమబింధు విధులకు హాజరుకాకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ప్రతీ రోజు సుమారుగా 2 వందల మంది వరకు ఓపీ చూసేవారు. గత నాలుగు రోజుల నుంచి వైద్యులు సమ్మెలో ఉండడంతో రోగులకు వైద్య సేవలు అందడం లేదు. గురువారం బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 70 మంది వరకు రోగులు వచ్చారు. వైద్యులు లేకపోవడంతో కొంతసమయం వేచిచూసి వెళ్లిపోయారు.

-జి.సిగడాం

రెండు రోజులపాటు రైల్వే గేటు మూసివేత

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ పరిధి ఆమదాలవలస-నరసన్నపేట రోడ్డులో ఊసవానిపేట వద్ద గల రైల్వే గేటు మరమ్మతు పనులు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 6 నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు రెండు రోజులపాటు గేటు మూసివేసి ఉంచుతున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని స్థానికులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

జిల్లాలో బెంతు ఒరియా తెగ లేదు

సారవకోట: జిల్లాలో బెంతు ఒరియా తెగ లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో బెంతు ఒరియా తెగ కుల ధ్రువీకరణ పత్రాలతో చాలా మంది ఉద్యోగం చేస్తున్నారని, అటువంటి వారి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలను సంపాదించి ఉద్యోగాలు చేస్తున్న వారికిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీలకు ఇచ్చిన హామీ అయిన మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయడం అనే హామీ నిలబెట్టుకోవాలని కోరారు.